ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియనగర్ ఫేజ్– 1 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే గాంధీని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. జనప్రియనగర్ ఫేజ్ -1 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జయసూరి, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, మల్లేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సంయుక్త కార్యదర్శి సురేష్, మార్తమ్మ, ట్రెజరర్ శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ ప్రభ, సభ్యులు సత్యనారాయణ, జగన్మోహన్‌రెడ్డి, వాసుదేవ్, బ్రహ్మయ్య, సాంబశివరావు, గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సకల సౌకర్యాలతో ఆరోగ్య కేంద్రం అందుబాటులో



భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. రహేజా గ్రూపు రూ.42 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన అదనపు భవనాన్ని కార్పొరేటర్ నాగేందర్ యాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, వీరేశంగౌడ్, రాజేశ్వరమ్మ, కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, రాంచందర్, రాంబాబు, గోపాల్‌యాదవ్, పద్మారావు, కెఎస్ రాములు పాల్గొన్నారు.

యువతలో నైపుణ్యం పెంపొందించడమే 'ఎస్కీ' లక్ష్యం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా అధ్యక్షుడు డా.రంగనాథ్



ఐసీఈ సెంటర్ భవనాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రంగనాథ్, డైరెక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: యువతలో నైపుణ్యం, పరిజ్ఞానం పెంపొందించడమే 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' లక్ష్యమని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి రంగనాథ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన ద్వారా 'ఎస్కీ'లో యువత ఉపాధి శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, సమాచార కేంద్రం నూతన భవనాన్ని ఆయన జ్యోతి వెలిగించి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్కీ స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, రవాణా, పవర్, టెలికమ్యూనికేషన్, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ప్రత్యేక కోర్సులను అందిస్తోందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ మరిన్ని శిక్షణా, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నూతన కుమార్, ప్రతినిధులు ఎం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎం నాగరాజు, ఎస్కీ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం చౌడేగౌడ్, డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ఎస్ ప్రశాంత్, సీనియర్ అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు, పలు విభాగాలకు చెందిన హెడ్స్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

మియాపూర్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని విశ్వనాథం గార్డెన్స్‌లో గురు ద గ్లోబల్ పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, శ్రీనివాస్ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

శంషాబాద్: పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ..కోనోకార్పస్ చెట్లను శాస్త్రవేత్తలు తొలగించాలని సూచించినప్పటికీ ఆయా స్థానిక సంస్థల అధికారులు ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఉన్న చెట్ల వల్ల మానవాళికే కాకుండా జంతువులకు సైతం ప్రమాదం కలుగుతుందన్నారు. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన చెట్లకు కాసిన విత్తనాలతో మరిన్ని చెట్లు పెరుగుతున్నాయన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రానివ్వం

ప్రతి రోజూ 800 మంచినీటి ట్యాంకర్ల సరఫరా ● జలమండలి జీఎం రాజశేఖర్



హఫీజ్‌పేట్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మెరుగైన నీటి సరఫరా కోసం కాలనీలు, బస్తీల్లో కొత్త పైప్‌లైన్లు వేస్తున్నాం. కాలనీలు, బస్తీలకు మరింత చేరువగా ఉండేందుకు కొత్తగా సెక్షన్లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు కూడా జలమండలి అధికారులకు సహకరించాలని శేరిలింగంపల్లి జలమండలి జీఎం రాజశేఖర్ కోరారు. శేరిలింగంపల్లి డివిజన్‌లో నీటి సరఫరాపై 'సాక్షి' ఇంటర్వ్యూలో వివరాలను వెల్లడించారు.

ప్రశ్న: శేరిలింగంపల్లి డివిజన్‌లో ఎన్ని తాగు నీటి కనెక్షన్లు ఉన్నాయి ?

జీఎం: మొత్తం 72,346 కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో డొమెస్టిక్ 46, 830, కమర్షియల్ 4,120, బస్తీల్లో 10,900, ఇతర కనెక్షన్లు 10,496.

ప్రశ్న: ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి. సామర్థ్యం ఎంత ?

జ: 33 రిజర్వాయర్లు ఉన్నాయి. మొత్తం సామర్థ్యం 106.70 ఎంఎల్, వీటిలో అత్యధికంగా 21.80 ఎంఎల్ సామర్థ్యం పటాన్‌చెరు సెక్షన్లలో ఉండగా, అత్యల్పంగా 0.90 ఎంఎల్ సామర్థ్యం హఫీజ్‌పేట్ సెక్షన్‌లో ఉన్నాయి.



హఫీజ్‌పేట్‌లోని శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి కార్యాలయం

ప్రశ్న: కొత్తగా ఏర్పడ్డ సెక్షన్లు ఎన్ని ?

జ: శేరిలింగంపల్లి పరిధిలో కొత్తగా డోయన్స్, హఫీజ్‌పేట్, దీప్తిశ్రీనగర్ సెక్షన్లు ఏర్పాటు చేశారు. వీటితో కలిపి మొత్తం 11 ఉన్నాయి. ఈ సెక్షన్లకు అనుగుణంగా 2 డివిజన్లు ఉన్నాయి. 11 మంది మేనేజర్లు, ఇద్దరు డిప్యూటీ జనరల్ మేనేజర్లు ఉన్నారు.

ప్రశ్న: అక్రమ నల్లా కనెక్షన్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ: అక్రమ నల్లా కనెక్షన్లపై చర్యలకు ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 4 కనెక్షన్లు పెట్టుకున్న వారిపై పోలీసు కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: ఉచిత నీటి పథకంలో ఎంత మంది లబ్ధిపొందుతున్నారు ?

జ: 11 సెక్షన్లు కలిపి మొత్తం 52,868 మంది లబ్ధిదారులు ఉచితంగా 20వేల లీటర్ల తాగు నీరు పొందుతున్నారు.



జలమండలి సరఫరా చేసే మంచినీటి ట్యాంకర్

ప్రశ్న: ప్రతి రోజు ఎన్ని మంచినీటి ట్యాంకర్లు సరఫరా చేస్తున్నారు ?

జ: శేరిలింగంపల్లి డివిజన్‌లో ఒక్క రోజు 1400 బుకింగ్ వస్తున్నాయి. కానీ ఒక్క రోజుకు 800 ట్యాంకర్ల సరఫరా చేసే సామర్థ్యం ఉంది. వేసవి కాలం ప్రారంభమవడంతో అధికంగా బుకింగ్‌లు వస్తున్నాయి. మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కొండాపూర్ ఏరియాలలో ట్యాంకర్ బుక్ చేసుకుంటే కనీసం మూడు రోజులు సమయం పడుతుంది. మిగతాచోట్ల ఒక్కరోజులో సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: నీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ?

జ: వేసవిలో ప్రైవేట్ బోర్లలో నీరు తగ్గినప్పుడు ట్యాంకర్ల బుకింగ్‌లు ఎక్కువగా వస్తున్నాయి. దానికి అనుగుణంగా వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు పెంచుతున్నాం. కొన్ని ప్రాంతాలలోనే సరఫరా ఆలస్యంగా చేస్తున్నాం.

మంచినీటి ట్యాంకర్ బుకింగ్ కోసం : 155313

ప్రజావాణి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పది ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు నాలుగు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, అర్బన్ బయో డైవర్సిటీ, యూసీడీ సెక్షన్‌లకు ఒక్కొక్కటి చొప్పున రాగా, శానిటేషన్ విభాగానికి రెండు ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



కృష్ణ జోషికి సాయం అందజేస్తున్న చైర్మన్ కొండ విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్: పేద విద్యార్థికి హోప్ ఫౌండేషన్ ఆర్థికసాయం అందించింది. తారానగర్‌కు చెందిన కృష్ణ జోషి స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఫీజు కట్టడానికి రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు కొండ విజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. శంకర్, జయశ్రీ జోషి తదితరులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా కారులో మంటలు

మాదాపూర్: రోడ్డుపై ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సోమవారం రాత్రి సైబర్ టవర్స్ నుంచి జేఎన్‌టీయూ వైపు వెళ్తున్న ఏపి11ఏటి 2277 నెంబర్ గల వోక్స్‌వాగన్ కారులో ఎన్ఐఏ ఫ్లైఓవర్ వద్ద అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. దీంతో అందులో ప్రయాణిస్తున్నవారు వెంటనే వాహనం దిగి బయటకు వచ్చేశారు. అయితే కారు రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలిసిన వెంటనే మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య సిబ్బందితో కలసి వచ్చి ట్రాఫిక్ సమస్యను తొలగించారు.

ప్రభుత్వవిప్‌ను కలిసిన టీఎన్‌జీఓ రంగారెడ్డి కాలనీవాసులు



రాయదుర్గం: తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్‌ను టీఎన్‌జీఓ రంగారెడ్డి కాలనీవాసులు కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల స్థలంలో 612 ప్లాట్లు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించారని ఇళ్లు నిర్మించుకున్నారని వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు.ఈ విషయంలో స్పెషల్ సీఎస్ రెవిన్యూ, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు .దీంతో ఆయన సమస్యలను పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గడ్డం జంగయ్య, ఉపాధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె జోసెఫ్, పలువురు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై సదస్సు



సదస్సులో సంస్థ, ఎంజీఐటీ ప్రతినిధులు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ ద్వారా విద్యార్థులకు రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు సాధించి ఉద్యోగాల్లో జరిగే పోటీల్లో ముందు వరుసలో నిలిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సు వారం రోజుల పాటు కొనసాగుతుందని, విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం



సీబీఐటీలో సుధీ-2024 ప్రారంభోత్సవంలో అతిథులు

మణికొండ: సమస్యల పరిష్కారానికి పరిశోధనలు ఎంతో అవసరమని, వాటికి ప్రభుత్వాలు చాలా నిధులు ఖర్చు చేస్తున్నాయని, వాటిపై విద్యార్థులు దృష్టిపెట్టినపుడే జీవితంలో రాణిస్తారని డిఫెక్ట్ మెటలాజికల్ రీసెర్చ్, ల్యాబొరేటరీ(డీఎంఆర్ఎల్) డైరెక్టర్, సైంటిస్ట్ డాక్టర్ ఆర్.బాలమురళీ కృష్ణన్ అన్నారు. గండిపేటలో చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం నుంచి జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ సుధీ-2024 ప్రారంభమయ్యింది. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పర్యావరణం స్థిరత్వం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచన, పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మన సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు యువ ఇంజినీర్లు పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ ఎం.కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సవాళ్లను స్వీకరించి వాటికి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. ఇలాంటి టెక్నికల్ ఫెస్ట్‌లతో విద్యార్థులు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవటంతో పాటు ఇతరుల నైపుణ్యాలను తెలుసుకోవడం, తమ నైపుణ్యాలకు మరింత పదును పెట్టుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సుధీ-2024 చైర్మన్ ప్రొఫెసర్ పి.ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి సంఘం అధ్యక్షుడు దృష్‌సక్సేనా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారే అడ్డా..

- అడ్డాకూలీలతో ట్రాఫిక్ సమస్య
- బ్రాడ్‌వే ఏరియాలోకి మార్చినా ఉపయోగం లేదు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు



కాళీమందిర్ చౌరస్తాలో రోడ్డుపైనే అడ్డా కూలీలు

బండ్లగూడ: కాళీమందిర్ చౌరస్తా నుంచి హైదరాబాద్, చేవెళ్ల, పర్గి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు రోడ్డుపై అడ్డా కూలీలతో ఇబ్బంది కలుగుతోంది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో వారి సమయం వృథా అవుతోంది. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భవన నిర్మాణ కార్మికులతో పాటు దినసరి పనులు చేసే అనేక మంది కూలీలకు ప్రత్యేకంగా ఒక స్థలం అంటూ లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం రోడ్డుపై వచ్చి నిలుచుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాళీమందిర్ చౌరస్తా ప్రధాన రహదారిపై పని ఉందా.. అంటూ వచ్చిపోయే వారిని అడుగుతూ రోడ్డుపైనే అడ్డా ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది.

రోడ్డుపైనే వ్యాపారాలు..

ఇక కాళీమందిర్ చౌరస్తాలో తోపుడుబండ్లపై చిరు వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. పండ్ల విక్రయాలు తదితర వ్యాపారాలు రోడ్డుపై జరపడంతో ఈ రహదారిలో తరచూ ట్రాఫిక్‌జాం ఏర్పడి పలు ప్రమాదాలకు దారి తీస్తుంది.

ట్రాఫిక్ జామ్..

రోజురోజుకూ ఈ ప్రాంతాల్లో నిర్మాణాలు భారీగా పెరుగుతుండటంతో దినసరి కూలీలు కూడా కాళీ మందిర్ ప్రాంతంలో ఎక్కువగా నివాసముంటారు. భవన నిర్మాణ పనులు, పెయింటింగ్, సెంట్రింగ్ తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగించే దినసరి కూలీలు ఉదయం సమయంలో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.



మాట్లాడుతున్న ట్రాఫిక్ అధికారులు (ఫైల్)

అడ్డా మార్చినా..

నార్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులు గతంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రోడ్డుపైన కూలీలు నిలవకుండా వారితో మాట్లాడి లేబర్ అడ్డాను రోడ్డు పక్కన గల బ్రాడ్‌వే ఏరియాలోకి మార్చారు. కూలీలు రోడ్డు దాటేందుకు వీలుగా అక్కడ పెలికాన్ సిగ్నల్ కూడా ఏర్పాటు చేశారు. కానీ అడ్డా కూలీలు మాత్రం బ్రాడ్‌వే ప్రాంతంలోకి వెళ్లడం లేదు. రోడ్డుపైనే ఉంటున్నారు.కాగా ట్రాఫిక్ జామ్ కాకుండా కూలీలు బ్రాడ్‌వే ఏరియాలో ఉండే విధంగా మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ,అలాగే తోపుడు బండ్ల విక్రయదారులు రోడ్డుపైకి రాకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం



చంద్రమౌళేశ్వరస్వామి

మణికొండ: కామేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీలోని శారదా చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వర స్వామి ఆలయం అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం సూర్య నమస్కారం, చండీ పారాయణం, శ్రీ కామేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి అష్టోత్తర శత కలశాభిషేకం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గణపతి హోమం, ఆయుష్యహోమం, రుద్రహోమం, లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను నిర్వహించారు. వేద మంత్రాలతో సెక్రటేరియట్ కాలనీ మారుమోగుతుంది.

నేటి పూజలు..

బ్రహ్మోత్సవాల్లో మూడవ, చివరి రోజు ఉదయం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి అష్టోత్తర కలశాభిషేకం, గణపతిహోమం, మన్యు సూక్త హోమం, సుబ్రహ్మణ్య మూల మంత్ర హోమం, అవాహిత దేవతా మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని శ్రీ శృంగేరి శారదా పీఠం గౌరవ ప్రతినిధి కశ్యప్ చతుర్వేది తెలిపారు.



కామేశ్వరీ సమేత చంద్రమౌళేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

'హాల్ టికెట్ ఇవ్వకపోతే ఊరుకోం'

అల్విన్‌కాలనీ: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఫీజులు కట్టలేదని హాల్ టికెట్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, హాల్ టికెట్ ఇవ్వకపోతే కళాశాలలను ముట్టడిస్తామని బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ అన్నారు. విద్యార్థులెవరూ విద్యా సంవత్సరం నష్టపోకూడదన్నారు.

19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం....శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 19 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పగలూ వెలుగుతున్న స్ట్రీట్ లైట్లు



పాపిరెడ్డి కాలనీకి వెళ్ళే రోడ్డులో ..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో స్ట్రీట్ లైట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డి కాలనీలో పగటి వేళ లైట్లు వెలగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ గృహకల్ప మల్టీపర్పస్‌ఫంక్షన్ హాల్ నుంచి పాపిరెడ్డి కాలనీకి వెళ్ళే రోడ్డులో లైట్లు వెలుగుతున్నాయి. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

'మనూ'లో దివ్యాంగ బాలబాలికలకు క్రీడా పోటీలు



రాయదుర్గం: మనూలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రారంభించారు. ఇంటర్ హాస్టల్స్ స్పోర్ట్స్, కల్చరల్ అండ్ లిటరరీ పోటీలు, ప్రత్యేకంగా బాలురు, బాలికల కోసం ప్రత్యేక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు.క్రీడాకారులను స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్‌జైసీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌లు అభినందించారు.

మహిళా శక్తి సమ్మేళనం

బండ్లగూడ: స్త్రీ శక్తి ఎనలేనిదని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని కేకే కన్వెన్షన్‌లో సోమవారం మహిళా శక్తి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు నాయకత్వం వహించే చోట ఫలితాలు ప్రయోజకరంగా ఉంటాయని తెలిపారు. గత ఏడాది భారతదేశం జీ-20 సమావేశాలకు అతిథ్యం ఇచ్చిందన్నారు. జీ -20 అతి ముఖ్యమైన అంశం జీ-20 ఎంపవర్ అని, ఇది మహిళలపై దృష్టి సారించిందని చెప్పారు. జీ -20 దేశాలలో మహిళా సాధికారిత సమూహాలున్నాయని, మహిళా శ్రామిక శక్తిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. జీ 20 సాధికారతకు తాను చైర్‌గా ఉన్నానన్నారు. కష్టపడి పని చేసే మహిళలను ఆదుకోవాలని ఆమె కోరారు.

రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభం


రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీయ రైల్వే దేశానికే ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీలోని ఈదుల నాగులపల్లి రైల్వేస్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జిని ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తెల్లాపూర్ వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి, రైల్వే నోడల్ అధికారి రామాంజనేయరావు, స్టేషన్ మేనేజర్ బుచ్చిరెడ్డి, సెక్షన్ ఇంజనీర్ మల్లేష్, సెక్షన్ కమిటీ వర్క్ మెంబర్స్ సురేందర్‌నాథ్ రెడ్డి, టెలికాం కమిటీ మెంబర్, నాగులపల్లి రైల్వే స్టేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఐటీయూని గెలిపించండి

రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూనే గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ పెన్నార్ కార్మికులకు పిలుపునిచ్చారు.పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి జరిగిన పెన్నార్ పరిశ్రమ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సీఐటియూ రాష్ట ఉపాధ్యక్షులు మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇస్నాపూర్ ఎంపీటీసీ సభ్యులు గడ్డం శ్రీశైలంలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్నార్ పరిశ్రమలో బీఆర్‌టీయూ అధికార గుర్తింపుగా యూనియన్‌గా ఉండి ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదని, వేతన ఒప్పందాన్ని మోసం చేసిందని వారు విమర్శించారు. పరిశ్రమలో కార్మికులకు వేధింపులతో పాటు మెమోలు ఎక్కువయ్యాయని ఆరోపించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



లాల్ మహ్మద్(ఫైల్)

గచ్చిబౌలి: అనారోగ్యంతో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాయదుర్గం పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఎండి.లాల్ మహ్మద్ 25న సాయంత్రం 5.30 గంటల సమయంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా అనారోగ్యం పాలయ్యాడు. వెంటనే మాదాపూర్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం 3.10 గంటలకు మృతి చెందినట్లు సీఐ మహేష్ తెలిపారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మూడు సంవత్సరాలుగా లాల్ మహ్మద్ బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు.

యాచకుడి మృతి

హఫీజ్‌పేట్: గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డులో ఓ యాచకుడు (40) సోమవారం ఉదయం పడి ఉన్నాడు. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి పరిశీలించారు. అప్పటికే మృతి చెందాడని గుర్తించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఒంటిపై గ్రే కలర్ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిస్తే చందానగర్ పోలీసులకు తెలియజేయాలని కోరారు.